PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 344 పేజీలు - 08 శనివారం 07 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

ఓటర్లకు మరో అవకాశం!

తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో

గల్లంతైన పేర్లకు మళ్లీ చోటు

అర్హులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా

చర్యలు: కేంద్ర ఎన్నికల సంఘం



2లో

కొడంగల్ అభివృద్ధికి రూ.9,100 కోట్లు!

- మూడు రోజుల పాటు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన..

13 అభివృద్ధి పనులకు శ్రీకారం



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 6 :ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.9,100 కోట్లతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పది ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు.ఈ అభివృద్ధి పనుల్లో రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు2 నిర్మాణం, రూ.2,100 కోట్లతో మహబూబ్‌నగర్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశ ఉన్నాయి. అలాగే రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల పనులు చేపట్టనున్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా, పరిశ్రమల రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మిగతా2లో...

నేడే పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు!

ఉదయం 8 గంటలకు ప్రారంభం..

రాష్ట్రవ్యాప్తంగా 365 కేంద్రాల్లో కౌంటింగ్

9,062 బల్లల ఏర్పాటు.. 30 వేల మందికిపైగా సిబ్బంది విధులు

70.72 శాతం పోలింగ్ నమోదు.. మూడు అంచెల భద్రత


2లో

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

ఈ నెల 13న ఏర్పడే అవకాశం.. 15 నాటికి వాయుగుండంగా బలపడుతుందా?

తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలపై ఉత్కంఠ


2లో

తుపాన్ నష్టంపై కేంద్రానికి చంద్రబాబు లేఖ!

తక్షణ సాయంగా నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి


మురసు తుపాన్‌తో రూ.1,919.59 కోట్ల నష్టం అంచనా


2లో

బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్

బీఎస్ఈ, నటుడు అమితాబ్ బచ్చన్ నివాసం, రేస్‌కోర్స్ కూడా లక్ష్యంగా హెచ్చరికలు

అప్రమత్తమైన ముంబై పోలీసులు.. అనుమానితుడి కోసం దర్యాప్తు


2లో

దీపావళి వేడుకల్లో బాధ్యత మరవొద్దు..

- సుప్రీంకోర్టు కీలక సూచనలు


2లో

ప్రభుత్వ భూముల వేలానికి సర్కార్ సిద్ధం!

ఆదాయ వనరుల పెంపునకు భట్టి విక్రమార్క ఆదేశాలు



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 6 : రాష్ట్ర ఆదాయ వనరులను పెంచే లక్ష్యంతో ప్రభుత్వ భూముల వేలం, ల్యాండ్ పూలింగ్, పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ లను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం సచివాలయంలో నిర్వహిం చిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ఆదాయ సమీకరణపై సమీక్షించారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ల్యాండ్ పూలింగ్‌కు అనువైన భూములను గుర్తించాలని సూచించారు. అజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట పారిశ్రామిక ప్రాంతాల్లో భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆధీనంలోని వేలానికి అనువైన భూములను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వేలానికి సిద్ధంగా ఉన్న భూములు, ప్లాట్ల వివరాలతో వచ్చే వారంలోగా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములు, లేఅవుట్లు, ప్లాట్ల వివరాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక డిజిటల్ డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. ప్రభుత్వ ఆస్తులను మిగతా2లో...



గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎస్టీ కమిషన్ ఉండాలి!

- సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి - ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ల ఏర్పాటును స్వాగతించిన కల్వకుంట్ల కవిత

తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 6 :తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్వాగతించారు. తమ పార్టీ చేసిన డిమాండ్‌కు ప్రభుత్వం స్పందించి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీలకు ఉమ్మడి కమిషన్ ఏర్పాటు

మిగతా2లో...

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం!

సాగునీటి రంగంలో చరిత్రలో నిలిచిపోయేలా పనులు

డిండి ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం.. పలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, చెక్‌డ్యామ్‌లకు మంజూరు

మిర్యాలగూడలో రూ.33 కోట్లతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవం



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 6 :ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి రంగంలో చరిత్రలో నిలిచిపోయేలా ప్రాజెక్టుల నిర్మాణం, కాల్వల

మిగతా2లో...

ఓటర్లకు మరో అవకాశం!

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 6: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. గైర్హాజరు, వలస, మరణం, నకిలీ ఓటర్లుగా గుర్తించి జాబితా నుంచి తొలగించిన వారికి తుది జాబితాలో పేరు చేర్చుకునేందుకు అవకాశం కల్పిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, నాగాలాండ్ రాష్ట్రాలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా చూడటంతోపాటు నకిలీ ఓటర్ల నమోదు జరగకుండా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం అధికారులను ఆదేశించింది.గణన పత్రాలు అందినప్పటికీ తిరిగి సమర్పించకపోవడంతో ముసాయిదా జాబితాలో పేరు చేరని వారు మళ్లీ గణన పత్రాలను సమర్పించవచ్చు. గతంలో ఉన్న నివాసంలోనే ఉంటున్నవారు ఆలస్యానికి కారణాన్ని వివరిస్తూ ప్రకటనతో పాటు గణన పత్రం అందించాలి. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్నవారు ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదు. కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలతో అనుబంధం-సి ప్రకటన, చిరునామా ధ్రువీకరణ పత్రంతో గణన పత్రాన్ని సమర్పించాలి.ఇప్పటికే కొత్త ఓటు నమోదు కోసం ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ గణన పత్రం, ప్రకటన ఇవ్వాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. సంబంధిత ఓటర్లను గుర్తించి సంప్రదించేందుకు బూత్ స్థాయి అధికారులు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇంటింటికీ వెళ్లడంతోపాటు పొరుగువారు, కుటుంబ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాల ద్వారా వివరాలు సేకరించాలని ఆదేశించింది.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

తొలి అక్షరం/విశాఖపట్నం, నవంబర్ 6:

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. 11న ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావంతో నవంబరు 13 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేసింది. అనంతరం అది పశ్చిమ వాయవ్య దిశగా పయనించి 15వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని పేర్కొంది.అయితే అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా? తమిళనాడు తీరం వైపు పయనిస్తుందా? అన్న అంశాలపై ప్రస్తుతం స్పష్టత లేదని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని వాతావరణ నమూనాలు 15వ తేదీ నాటికి వాయుగుండంగా బలపడే అవకాశాన్ని సూచిస్తున్నప్పటికీ, దాని తీవ్రత, దిశపై మరికొన్ని రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అధికారులు ఈ వ్యవస్థ కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

దీపావళి వేడుకల్లో బాధ్యత మరవొద్దు..

తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 6: ఢిల్లీతోపాటు పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణకు తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. వాహనాల నుంచి వెలువడే పొగ కాలుష్యానికి ప్రధాన కారణమని పేర్కొంది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 400కు చేరువ కావడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీతోపాటు ఘజియాబాద్, గురుగ్రామ్, ఫరీదాబాద్, గ్రేటర్ నోయిడా నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, ప్రజా రవాణాను బలోపేతం చేయాలని సూచించింది.పంట వ్యర్థాలను తగులబెట్టకుండా రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని, వాటి కొనుగోలు ధరను ముందుగానే ప్రకటించాలని కేంద్రానికి తెలిపింది. గ్రామ పంచాయతీల ద్వారా సేకరణ, నిల్వ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించింది.కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక ఉద్గారాలు, వాహన కాలుష్యం, నిర్మాణ వ్యర్థాలు, రోడ్ల దుమ్ము, పంట వ్యర్థాల దహనంపై చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం ఢిల్లీ కాలుష్యంలో పంట వ్యర్థాల దహనం వాటా 14 శాతంగా ఉందని వెల్లడించారు.పాఠశాలల మూసివేత, ఆన్‌లైన్ తరగతుల నిర్వహణపై నిపుణుల అభిప్రాయాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు తెలిపింది. తదుపరి విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది. శుక్రవారం ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ 391గా నమోదైంది. రోహిణిలో అత్యధికంగా 475గా నమోదుకాగా, ఐఐటీ ఢిల్లీ ప్రాంతంలో 472గా నమోదైంది.

బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్

తొలి అక్షరం/ముంబై,నవంబర్ 6: బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపులతో కూడిన ఈ-మెయిల్ రావడంతో ముంబైలో భద్రతా ఆందోళన నెలకొంది. శుక్రవారం వచ్చిన ఈ సందేశంలో బాంబే హైకోర్టుతోపాటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), వర్లీ రేస్‌కోర్స్, బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసమైన 'జల్సా'ను పేల్చివేస్తామని హెచ్చరించినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ-మెయిల్ అందిన వెంటనే ముంబై పోలీసులు, బాంబు గుర్తింపు, నిర్వీర్య బృందాలు, భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు. ఈ బెదిరింపులు కేవలం భయపెట్టేందుకే చేసినవా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.ఈ-మెయిల్ పంపిన వ్యక్తి వివరాలు తెలుసుకునేందుకు సైబర్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సందేశం పంపిన వారి ఐపీ చిరునామాను గుర్తించే పనిలో ఉన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని పలు న్యాయస్థానాలకు కూడా ఇలాంటి బెదిరింపు సందేశాలు రావడంతో తాజా ఘటనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రభుత్వ భూముల వేలానికి సర్కార్ సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

సమర్థంగా వినియోగించుకుంటూ పారదర్శకంగా ఆదాయం పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొడంగల్ అభివృద్ధికి రూ.9,100 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

కొడంగల్‌లో రూ.123 కోట్లతో వ్యవసాయ కళాశాల, రూ.118.80 కోట్లతో పది తెలంగాణ పబ్లిక్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్టాండ్ల నిర్మాణంతో పాటు నైపుణ్యాభివృద్ధి కేంద్రం, సమీకృత కార్యాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో రూ.81 కోట్లతో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు.పర్యటనలో భాగంగా హకీంపేటలో రైతుమేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం ప్రారంభించనున్నారు. పారిశ్రామికవేత్తలు, రైతులతో సమావేశమై అభివృద్ధి ప్రణాళికలపై చర్చించనున్నారు. నవంబరు 9న హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభకు సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పర్యటనతో కొడంగల్ ప్రాంతంలో అభివృద్ధి పనులకు మరింత ఊతం లభించనుంది.

నేడే పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు!

తొలి అక్షరం/విజయవాడ,నవంబర్ 6: ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఉదయం 8 గంటలకు 365 కేంద్రాల్లో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 9,062 కౌంటింగ్ బల్లలను సిద్ధం చేయగా, 11,002 మంది పర్యవేక్షకులు, 28,692 మంది కౌంటింగ్ సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించారు. **తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు** కౌంటింగ్ ప్రక్రియలో ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ పెట్టెలను తెరిచి ఓట్ల లెక్కింపు చేపడతారు. ఎంపీటీసీ ఎన్నికలకు ఉపయోగించిన గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు, జడ్పీటీసీ ఎన్నికలకు ఉపయోగించిన తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను వేర్వేరుగా విభజి స్తారు. వాటిని 25 చొప్పున కట్టలుగా తయారు చేసి, విడివిడిగా కలిపిన తర్వాత లెక్కిస్తారు. మొత్తం బల్లల్లో సగం జడ్పీటీసీ, మిగిలిన సగం ఎంపీటీసీ ఓట్ల లెక్కిం పునకు కేటాయించారు. ఒక్కో బల్లపై ప్రతి విడతలో వెయ్యి బ్యాలెట్లను లెక్కించనున్నారు. **70.72 శాతం పోలింగ్ నమోదు** నవంబరు 5న రాష్ట్రవ్యాప్తంగా 577 జడ్పీటీసీ, 7,707 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 70.72 శాతం ఓటింగ్ నమోదైంది. 2021లో జరిగిన గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 9.81 శాతం అధికంగా పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 82.51 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 62.01 శాతం ఓటింగ్ నమోదైంది. మరోవైపు 77 జడ్పీటీసీ, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. **రీపోలింగ్ కూడా పూర్తి** మురసు తుపాను ప్రభావంతో తూర్పుగో దావరి జిల్లాలోని గోపాలపురం, ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు మండలాల్లో వాయిదా పడిన పోలింగ్‌ను నవంబరు 6న నిర్వహించారు. అలాగే అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో వివిధ కారణాలతో తిరిగి పోలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో నేడు ఓట్ల లెక్కింపునకు అధికారులు సిద్ధమయ్యారు. **కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత** ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, సమస్యా త్మక ప్రాంతాల్లో డ్రోన్లు, పోలీసుల శరీరాలకు అమర్చిన కెమెరాలతో నిఘా కొనసాగించనున్నారు. బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రాల కు భారీ భద్రత మధ్య తరలించారు. **మధ్యాహ్నం నుంచి ఫలితాలపై ఉత్కంఠ** బ్యాలెట్ పత్రాలతో ఓట్ల లెక్కింపు జరగనున్నందున ఫలితాలు విడతలవారీగా వెలువడనున్నాయి. మధ్యాహ్నం నుంచి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఫలితాలు ముందుగా, జడ్పీటీసీ ఫలితాలు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అంచనా. రాత్రి వరకు కొన్ని స్థానాల ఫలితాలు వెలువడే అవకాశముంది. వేలాది మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని తేల్చ నున్న ఈ కౌంటింగ్‌పై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

తుపాన్ నష్టంపై కేంద్రానికి చంద్రబాబు లేఖ!

తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 6: వరుస తుపాన్లతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. మురసు తుపాన్ కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.1,919.59 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు. అక్టోబరు 27న వచ్చిన అర్నబ్ తుపాన్ నష్టం నుంచి రాష్ట్రం కోలుకోకముందే మరో తుపాన్ విరుచుకుపడటంతో రైతులు, మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. **1.86 లక్షల మంది రైతులకు నష్టం**మురసు తుపాన్ ప్రభావంతో 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 1,86,063 మంది రైతులు నష్టపోయారని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.874.96 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉద్యాన పంటలు 6,504.38 హెక్టార్లలో దెబ్బతినగా, 12,178 మంది రైతులకు నష్టం జరిగింది. ఈ రంగంలో రూ.337.10 కోట్ల నష్టం అంచనా వేశారు.**అనేక రంగాలపై తుపాన్ ప్రభావం**పశు సంవర్ధక, ఆక్వా, గృహ నిర్మాణం, సాగునీరు, విద్యుత్, పంచాయతీరాజ్, విద్య, వైద్య రంగాల్లోనూ భారీ నష్టం జరిగినట్లు కేంద్రానికి వివరించారు. వరద నీరు తగ్గిన తర్వాత పూర్తిస్థాయి నష్టం అంచనా వేస్తామని, 15 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పిస్తామని తెలిపారు. రైతులు, మత్స్యకారులు, ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు తక్షణ సహాయం అందించడంతో పాటు దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణకు కేంద్రం నిధులు విడుదల చేయాలని కోరారు.**ప్రజలకు అండగా ప్రభుత్వం** తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. విద్యుత్ సరఫరా, రహదారులు, ఇతర అత్యవసర సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం నుంచి తక్షణ ఆర్థిక సాయం అందితే బాధితులకు ఉపశమనం కలగడంతో పాటు రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు వీలవుతుందని లేఖలో వివరించారు.

గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎస్టీ కమిషన్ ఉండాలి!

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో రెండు వర్గాల సమస్యలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని అభిప్రాయపడ్డారు. ఎస్సీలు ఎదుర్కొంటున్న అణచివేత, దౌర్జన్యాలు ఒకవైపు ఉంటే.. ఆదివాసీలు, గిరిజనులు అడవుల నుంచి దూరమయ్యే పరిస్థితులు మరోవైపు ఉన్నాయని అన్నారు. జల్‌జంగల్‌జమీన్‌పై గిరిజనుల హక్కులకు ముప్పు ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు కానున్న ఎస్టీ కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని కవిత సూచించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణతో పాటు వారి ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.
గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరించేలా కమిషన్ పనిచేయాలని పేర్కొన్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నవంబరు 5న జరిగిన కేబినెట్ సమావేశంలో ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి రెండు ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2003 చట్టాన్ని రద్దు చేసి, 2026లో కొత్త చట్టాలు తీసుకురావడానికి ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఆమోదం తెలిపారు. ఒక్కో కమిషన్‌లో చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులు ఉండనున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి పనులను చేపడుతోందని తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడలోని గుమస్తా కాలనీలో రూ.33 కోట్ల వ్యయంతో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని బస్వాపూర్, ధర్మారెడ్డికాల్వ, పిలాయిపల్లి ప్రాజెక్టులతో పాటు మిర్యాలగూడలోని తోపుచర్ల, కేశవాపురం, కొండ్రపోలు, దున్నపోతులగండి ఎత్తిపో తల పథకాల పనులను పూర్తి చేస్తామని ప్రకటించారు. దామ రచర్లలోని శాంతినగర్, వేము లపల్లిలోని రావులపెంట వాగులపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వజీరాబాద్ ప్రధాన కాల్వ లైనింగ్ పనులను కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడు తూ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తిస్థాయిలో లబ్ధిదారు లకు అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యా ప్తంగా అసంపూర్తిగా ఉన్న 3,600 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మిగిలిన వెయ్యి ఇళ్ల నిర్మాణా లను పూర్తి చేసి పేదలకు అందించాలని సూచించారు.

అక్రమ ఐవీఎఫ్ కేంద్రాలపై ఉక్కుపాదం!


నిబంధనలు ఉల్లంఘిస్తే
శాశ్వతంగా రిజిస్ట్రేషన్లు రద్దు
అక్రమ అండాల సేకరణ ముఠాతో
సంబంధాలున్న కేంద్రాలపై సమగ్ర విచారణ
బాధ్యులైన వైద్యుల లైసెన్సుల రద్దుకూ
చర్యలు: మంత్రి దామోదర్ రాజనర్సింహ



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 6: సంతానలేమితో బాధపడుతున్న దంపతులను లక్ష్యంగా చేసుకుని ఐవీఎఫ్ కేంద్రాల ముసుగులో జరుగుతున్న అక్రమాలు, దోపిడీకి అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాల రిజిస్ట్రేషన్లను శాశ్వతంగా రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఇటీవల వెలుగులోకి వచ్చిన అండాల అక్రమ సేకరణ వ్యవహారంపై చర్చించారు. ఈ అక్రమాలతో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అక్రమాల్లో భాగస్వాములైన వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసే అంశంపై రాష్ట్ర జాతీయ వైద్య మండళ్లతో సంప్రదింపులు జరపాలని సూచించారు. పోలీసుల దర్యాప్తునకు ఆరోగ్యశాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు. సరోగసీ, సహాయక పునరుత్పత్తి సాంకేతికత (ఏఆర్‌టీ) చట్టాలను మరింత పటిష్ఠంగా అమలు చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి, కేంద్ర చట్టాల పరిధిలో అదనపు నియంత్రణ చర్యలు చేపట్టే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, అవసరమైనప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఐవీఎఫ్ చికిత్సలో వినియోగించే మందుల తయారీ నుంచి విక్రయాల వరకు డ్రగ్ కంట్రోల్ అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. చికిత్స పేరుతో దంపతులపై అనవసర ఆర్థిక భారం మోపడం, వారిని మోసం చేయడం సహించబోమని హెచ్చరించారు. గతంలో సృష్టి ఫెర్టిలిటీ కేంద్రంలో జరిగిన అక్రమాలను అరికట్టినట్లుగానే, తాజాగా అండాల అక్రమ సేకరణ ముఠా వ్యవహారంలోనూ కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. మరోవైపు సామాన్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ రంగంలో ఐవీఎఫ్ సేవలను మరింత విస్తరించాలని ఆదేశించారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడువులోగా పూర్తి చేయాలి

తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి నవంబర్- 06: ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ పాల్గొన్నారు.ఈ సమావేశంలో తాగునీటి సరఫరా, పీఎం శ్రీ పాఠశాలలు, సమగ్ర శిక్షా అభియాన్ నిధుల వినియోగం, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణ ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్షించారు. వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట్ల ప్రైవేట్ బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, చేతిపంపులు, బోర్ల మరమ్మతులను నవంబర్ 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.పీఎం శ్రీ పాఠశాలలకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో



వినియోగించుకొని తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచాలని కలెక్టర్ తెలిపారు. సమగ్ర శిక్షా అభియాన్ నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం నాణ్యతను పరిశీలించాలని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులను వేగవంతం చేసి కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలని ఆదేశించారు.ఇదిలా ఉండగా, బేతుపల్లి చెరువులో చిక్కుకున్న వారిని రాత్రింబవళ్లు శ్రమించి సురక్షితంగా రక్షించడంలో జిల్లా కలెక్టర్



దివాకర టిఎస్ చూపిన చొరవ, నాయకత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం చేసిన కృషిని ప్రశంసించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ కె. శ్రీరామ్, డీపీఓ వినోద్ కుమార్, ఆర్అండ్బీ ఎస్ఈ యుగంధర్ రావు, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా, సురక్షితంగా దీపావళి జరుపుకోవాలి



తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి నవంబర్- 06: దీపావళి పండుగను పర్యావరణహితంగా, సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.బాణాసంచా కాల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. టపాసులు కాల్చేటప్పుడు నూలు దుస్తులు ధరించాలని, నైలాన్, పాలిస్టర్ దుస్తులకు దూరంగా ఉండాలని సూచించారు. భవనాలు, విద్యుత్ తీగలకు దూరంగా ఖాళీ ప్రదేశాల్లోనే బాణాసంచా కాల్చాలని, ముందస్తుగా నీరు, ఇసుక, ప్రథమ చికిత్స సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు.పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, వెలగని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు. ఇళ్లలో, బాల్కనీల్లో బాణాసంచా కాల్చరాదని సూచించారు. దీపాలను మండే వస్తువులకు దూరంగా ఉంచాలని, పెంపుడు జంతువులకు ఇబ్బంది కలిగించేలా పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాల్చకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ కుటుంబ సభ్యులతో సురక్షితంగా దీపావళి జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ఎంపిక కమిటీల్లో సర్పంచులకు చైర్మన్ బాధ్యతలు కల్పించాలి

గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన నూతన కమిటీల ఏర్పాటుకు అనుమతివ్వాలి.

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన సర్పంచులు.

సుర్వి మల్లేష్ గౌడ్ అంకిరెడ్డిగూడెం సర్పంచ్,చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు

తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 6:ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కమిటీలను గ్రామ సర్పంచుల అధ్యక్షతన నూతనంగా ఏర్పాటు చేయాలని చౌటుప్పల్ మండల సర్పంచుల ఫోరం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం చౌటుప్పల్ ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన మండలంలోని పలువురు సర్పంచులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందు ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీలను రద్దు చేసి, నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గౌరవప్రదమైన



బాధ్యతలు కల్పించాలని వారు కోరారు. పంచాయతీరాజ్ చట్టం2018 ప్రకారం గ్రామ సర్పంచులకు కల్పించిన విధులు, బాధ్యతల్లో భాగంగా గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో సర్పంచుల భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. అందులో భాగంగా గ్రామ సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరించేలా నూతన ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.ఈ మేరకు చౌటుప్పల్ ఎంపీడీవో శ్రీలతకు సర్పంచులు వినతిపత్రం అందజేసి, తమ విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.సర్పంచుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే పార్టీలకతీతంగా మండలంలోని సర్పంచులందరూ ఐక్యంగా ఉద్యమించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ అంశంపై గతంలోనే, 2026 మార్చి 17న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌కు సైతం వినతిపత్రం అందజేసినట్లు సుర్వి మల్లేష్ గౌడ్ తెలిపారు.ఈ సమావేశంలో దండు మల్కాపురం సర్పంచ్ గిర్కంటి నిరంజన్ గౌడ్, కొయ్యలగూడెం సర్పంచ్ కైరం కొండ స్వప్న, అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల, మందోళ్లగూడెం సర్పంచ్ తంగెళ్ల వెంకటేశం, పెద్దకొండూరు సర్పంచ్ గుండెబోయిన శిరీష, కుంట్లగూడెం సర్పంచ్ అన్యాలపు నరేష్, జైకేసారం సర్పంచ్ సమ్మిరెడ్డి భారతమ్మ, కాట్రేవ్ బోయ సర్పంచ్ మహేంద్ర మణి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ పాలనపై 650 మంది అధికారులకు శిక్షణ





తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి నవంబర్- 06: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ పాలనలో భాగంగా ఈ-హెచ్ఆర్ఎంఎస్, ఈ-శాంక్షన్స్, వామిస్ విధానాలపై శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి శిక్షణ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పీఏఓ కె. రామ్ శిక్షణ ఇచ్చారు. సుమారు 650 మంది అధికారులు, ఖజానా సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ ఉద్యోగుల నియామకం నుంచి పదవీ విరమణ వరకు సేవా వివరాలు, ప్రభుత్వ ఖర్చుల అనుమతులు, బిల్లుల మంజూరు, అభివృద్ధి పనుల పర్యవేక్షణ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని తెలిపారు. ఈ విధానాలతో పాలనలో పారదర్శకత పెరిగి, ఫైళ్ల జాప్యం తగ్గుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల అధికారులు డిజిటల్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు.కార్యక్రమంలో వైరా ఏటీఓ ప్రసన్నకుమార్, ఎస్టీవోలు మోదుగు వేలాద్రి, నాగేంద్రకుమారి, మధిర వెంకటేశ్వర్లు, సునీల్, విజయసారథి, పీఏఓ సూపరింటెండెంట్ రాధికారెడ్డితో పాటు ఖజానా సిబ్బంది పాల్గొన్నారు.

డిండి ప్రాజెక్టుపై ప్రజాప్రతినిధులు మౌనం వీడాలి

● ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులు రాజకీయాలకు అతీతంగా ఏకమై పోరాడాలి: ఢిల్లీ మాధవ రెడ్డి



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 6:దేవరకొండ, మునుగోడు ప్రజల సాగునీరు, తాగునీటి అవసరాల కోసం డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఢిల్లీ మాధవ రెడ్డి డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ ప్రజాప్రతినిధులు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరమన్నారు.జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ అంశంపై స్పందించాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముందుండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజాసంఘాలు ఏకమై ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ప్రాజెక్టు పూర్తయితే చెరువులు, కుంటలకు నీరందడంతో పాటు సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

బేతుపల్లి వరదల సమయంలో ప్రజల భద్రతకు కలెక్టర్ విశేష కృషి

- జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్‌ను అభినందించి శాలువాతో సత్కరించిన టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ

- బాధ్యతకు, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా కలెక్టర్ సేవలు: జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, కార్యదర్శి అర్వపల్లి నగేష్

తొలి అక్షరం/ఖమ్మం, జిల్లా ప్రతినిధి నవంబర్- 06: అధికారం అంటే హోదా మాత్రమే కాదు.. ప్రజల కష్టాల్లో అండగా నిలిచే బాధ్యత అని నిరూపించిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్.ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) మామిడి సోమయ్య యూనియన్ ఖమ్మం జిల్లా కమిటీ ఘనంగా సత్కరించింది. జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు కలెక్టర్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేతుపల్లి చెరువు ఘటన నేపథ్యంలో కలెక్టర్ దివాకర్ టీ.ఎస్. స్వయంగా ఘటనాస్థలాన్ని సందర్శించి, గత రెండు రోజులుగా విశ్రాంతి లేకుండా భద్రతా చర్యలను పర్యవేక్షించారని తెలిపారు. సంబంధిత అధికారులను సమన్వయం చేస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారని కొనియాడారు.విపత్కర పరిస్థితుల్లో అధికారి స్పందించే వేగమే ప్రజలకు కొండంత భరోసా అని, బాధ్యతను విధిగా కాకుండా మానవత్వంతో నిర్వర్తించినప్పుడే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోగలరని జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. అధికారి అంటే



కార్యాలయాల్లో కూర్చొని ఆదేశాలు జారీ చేయడం మాత్రమే కాదని, ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు వారి మధ్యకు వెళ్లి భరోసా కల్పించడమే నిజమైన ప్రజాసేవ అని పేర్కొన్నారు.పదవులు హోదాను ఇస్తాయని, ప్రజల కోసం చేసే సేవే గౌరవాన్ని తెచ్చిపెడుతుందని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కలెక్టర్ చూపిన చొరవ, బాధ్యతాయుతమైన పర్యవేక్షణ ఎప్పటికీ అభినందనీయమన్నారు.సన్మానానికి స్పందించిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యతని, బేతుపల్లి ఘటనను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని పటిష్టమైన భద్రతా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజల ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదని, ప్రజల భద్రత కోసం ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని తెలిపారు.ప్రజా సమస్యలపై స్పందించే అధికారులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తారని, బేతుపల్లి ఘటనలో కలెక్టర్‌తో పాటు అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి గౌస్ పాషా చూపిన చొరవ ప్రజల్లో అధికార యంత్రాంగంపై నమ్మకాన్ని మరింత పెంచుతుందని జర్నలిస్టులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, జాతీయ మండలి సభ్యులు ఎలుగోటి వెంకట్, కప్పల మధు, రాష్ట్ర మండలి సభ్యులు బంక మన్మధరావు, మామిడాల వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల రామ్మూర్తి, చిన్నంశెట్టి రాంబాబు, పామర్తి నాగేశ్వరరావు, మల్లెబోయిన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



బాలల పరిరక్షణ అందరి బాధ్యత

- 15 మంది సభ్యులతో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

- బాల్యవివాహాలు, బాల కార్మికత్వం, చిన్నారులపై హింసను అరికట్టాలి: ఏసీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ శోభ



తొలి అక్షరం/పెద్దవంగర నవంబర్ 6: మండలంలోని వద్దకొత్తపెల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం-3లో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, భద్రత, ఆరోగ్యం, విద్యపై చర్చించారు. 15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు.బాల్యవివాహాలు, బాల కార్మికత్వం, చిన్నారులపై హింసను అరికట్టాలని, ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే కమిటీకి సమాచారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. పిల్లలను బడికి పంపిస్తూ వారి చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని, బాలల సంరక్షణలో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కూడా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంతలపెల్లి పరశురామ్, పంచాయతీ కార్యదర్శి వనిత, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శేషవల్లి, అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, అరుణ, ఆరోగ్య ఉపకేంద్ర సీనియర్ ఏఎన్ఎం వెంకటలక్ష్మి, శ్రీదేవి, బూబా, ఆశా కార్యకర్త హేమలత, ఆయా స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి కోసం ఆరాటం.. మునుగోడు అభివృద్ధిపై నిర్లక్ష్యం!

● అధికారంలో ఉండి నిధులు తీసుకురాకపోవడం ప్రజలకు అన్యాయం: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్ 5:మంత్రి పదవి, రాజకీయ కాంట్రాక్టుల కోసం ప్రయత్నించడం తప్ప మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకత్వానికి చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. అధికారంలో కొనసాగుతూ నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు తీసుకురావడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు.గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిధుల కోసం గొంతెత్తిన నాయకులు, ఇప్పుడు అధికారంలో ఉండి కూడా నిధులు రావడం లేదని చెప్పడం వారి పనితీరుకు నిదర్శనమన్నారు. మంత్రి పదవి కోసం ఆరాటపడటం, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం పోరాడటం కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించడమే నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు.మునుగోడు ప్రజలకు మాటలు చెప్పడం కాకుండా చేతల్లో అభివృద్ధి చూపించాలని, పదవుల రాజకీయాలను పక్కనపెట్టి నియోజకవర్గానికి నిధులు తీసుకురావాలని కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పర్యటించిన పబ్బు రాజు గౌడ్

- జాతీయ రహదారి పనులతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచన



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 6:జాతీయ రహదారి నిర్మాణ పనుల నేపథ్యంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో రోజురోజుకూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ ప్రత్యేక చొరవ చూపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పట్టణ కేంద్రంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. రహదారి నిర్మాణ పనుల కారణంగా వాహనదారులు, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లపై దృష్టి సారించాలని కోరారు.జాతీయ రహదారి పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజల భద్రతకు, సాఫీగా వాహనాల రాకపోకలకు ప్రాధాన్యత ఇవ్వాలని పబ్బు రాజు గౌడ్ పోలీసు అధికారులకు సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్ బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, బొబ్బిళ్ళ రాజేందర్, బత్తుల శ్రీహరి, సీతారామచంద్ర ఆలయ చైర్మన్ బొబ్బిలి మురళి, సర్పంచ్ జ్యువి నరసింహ, బొంగు జంగయ్య గౌడ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బాబా షరీఫ్, పస్తం గంగారాములు, జంగయ్య, కిరణ్ పాల్గొన్నారు.

కాసం భద్రమ్మ మృతదేహానికి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నివాళులు



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 6:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఆవుల చంద్రయ్య తల్లి, రెడ్లవాడ సొసైటీ చైర్మన్ ఆవుల శ్రీనివాస్ నాయనమ్మ కాసం భద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆమె నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట టీపీసీసీ సభ్యులు పెండం రామానంద్, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బోంపల్లి దేవేందర్‌రావు, మండల అధ్యక్షుడు లావుడ్యా తిరుమల్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని భద్రమ్మకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

36వ అఖిల భారత రైతు మహాసభల విజయవంతానికి విరాళాల సేకరణ

వరి ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి బూర్గు కృష్ణారెడ్డి

చింతల సుదర్శన్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి



తొలి అక్షరం/చిన్నకొండూరు, నవంబర్ 6: నల్లగొండలో నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న 36వ అఖిల భారత రైతు మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ చిన్నకొండూరు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతులు, వ్యాపారుల నుంచి మహాసభల నిర్వహణ కోసం విరాళాలు సేకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు దిశానిర్దేశం చేసే 36వ అఖిల భారత రైతు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం వ్యవసాయ మార్కెట్‌లో వరి ధాన్యం కొనుగోలు పరిస్థితులను పరిశీలించారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నప్పటికీ, 15 రోజుల క్రితమే ప్రారంభించాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొబ్బరికాయలు కొట్టడానికి మాత్రమే పరిమితమయ్యాయని విమర్శించారు. అకాల వర్షాల కారణంగా కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో మిల్లర్లకు తక్కువ ధరలకు ధాన్యం విక్రయిస్తూ నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చింతల సుదర్శన్, సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమూలం నందీశ్వర్, రైతు సంఘం సీనియర్ నాయకులు ఘర్ష నరసింహ, చింతపల్లి నరసింహారెడ్డి, ఎలక రాజు, యాదగిరి, బాలు, ఆంజనేయులు, కేసాని యాదయ్య, సత్తమ్మ, నత్తి బుచ్చయ్య, కుందారపు మల్లేశం, ఆనగంటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకలో కాబోయే వధూవరులకు ఆశీస్సులు

- వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 6:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండ గ్రామంలో మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు అనుముల ధర్మారెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకకు తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ హాజరయ్యారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ దొనికేన సారంగపాణి, సర్పంచులు కట్కూరి నరేందర్‌రెడ్డి, పొన్నం రంగారెడ్డి, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల, ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేయాలి



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 6:జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఏరియా ఆసుపత్రి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని శాసనమండలి సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సూచించారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్‌తో కలిసి నిర్మాణ పనులు, తరగతి గదులను పరిశీలించారు. అవసరమైతే అదనపు నిధుల కోసం ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు.విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, కళాశాల పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని డీఎస్పీ తిరుపతిరావును కోరారు. కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నాం

రేషన్ షాపుల ప్రారంభంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

పెద్ద ఎల్కిచర్ల, చేగిరెడ్డి ఘనపూర్‌లో నూతన రేషన్ దుకాణాలు ప్రారంభం



తొలి అక్షరం/జిల్లేడు చౌదరిగూడ, నవంబర్ 06: జిల్లేడు చౌదరిగూడెం రాష్ట్రంలోని పేద ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లేడు చౌదరిగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాకారం చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల, చేగిరెడ్డి ఘనపూర్ గ్రామాల్లో నూతన చౌక ధరల రేషన్ దుకాణాలను ఇన్‌చార్జి తహసీల్దార్ భాస్కర్, సర్పంచులు సోని, పావనితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గత పదేళ్లలో రేషన్ కార్డులు అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేలాది మంది అర్హులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు రేషన్ సరుకులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, జీపీవో శ్రీనివాస్, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, రేషన్ డీలర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం: నల్లగొండ సమ్మయ్య



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 6:వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ సెంటర్ సమీపంలో మాజీ సర్పంచ్ కీర్తిశేషులు పలుసం విశ్వనాథం గౌడ్ 6వ వర్ధంతి సందర్భంగా ఆయన ఇంటి ఆవరణలో కుటుంబ సభ్యులతో కలిసి వనప్రేమికుడు, అంతర్జాతీయ హరిత మిత్ర అవార్డు గ్రహీత నల్లగొండ సమ్మయ్య వేప, మామిడి, పూలు, పండ్ల మొక్కలు నాటించారు. సమ్మయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని, చెట్లు మనకు రక్షణగా నిలుస్తాయని అన్నారు. నాటిన మొక్కలు పెరిగి మంచి వాతావరణాన్ని అందించాలని ఆకాంక్షించారు. అనంతరం పలుసం విశ్వనాథం గౌడ్‌కు నివాళులర్పించారు.కార్యక్రమంలో పలుసం సరోజన, విశ్వనాథం గౌడ్, భాగ్యలక్ష్మి, రాజేందర్, పావని, నవీన్ గౌడ్, నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. తమ ఇంటి ఆవరణలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే మొక్కలు నాటించినందుకు సమ్మయ్యకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హకా రైతు సేవా కేంద్రం ప్రారంభం - రైతులకు అందుబాటులో సేవలు



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 6:రామన్నపేట మండల కేంద్రంలో హకా రైతు సేవా కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, నిర్వాహకులు బెల్లం మల్లేష్, కావలి రాజు, సిరికొండ పవన్ లను అభినందించారు.సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు గుత్తా నర్సిరెడ్డి మాట్లాడుతూ, మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రం ప్రారంభం కావడం శుభసూచకమని, నిర్వాహకులు రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం జానీ, నిదానపల్లి సర్పంచ్ నారపాక మాధవి, కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, ఉపసర్పంచ్ మోటే రమేష్, కాంగ్రెస్ నాయకులు సురేందర్రావు, ఎండీ అక్రమ్, వార్డు మెంబర్లు కొమ్ము శేఖర్, కొమ్ము రామస్వామి, మోటే మహేష్, సుదర్శన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

2028లో తెలంగాణలో బీసీ ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యం: తీన్మార్ మల్లన్న

- మునుగోడు నుంచి తొలి బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకోవాలి

- బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని పిలుపు





తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 6:2028 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీసీ ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రకటించారు. బీసీ రాజ్యాధికార యాత్రలో భాగంగా 44వ రోజు పాదయాత్ర శుక్రవారం చౌటుప్పల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ సంక్షేమానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మల్లన్న విమర్శించారు. ఐదేళ్లలో బీసీ సంక్షేమానికి రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయించి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఉపకార వేతనాలు, వసతి గృహాల నిర్వహణ, గౌడ, చేనేత కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.మునుగోడు నియోజకవర్గంలో సుమారు 2.52 లక్షల ఓట్లకు గాను 1.37 లక్షలకు పైగా బీసీ ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో బీసీ ఓటర్లు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క బీసీ నాయకుడు కూడా ఎమ్మెల్యేగా ఎన్నిక కాలేదన్నారు. బీసీలు ఐక్యంగా ఉండి తమ జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం సాధించాలని పిలుపునిచ్చారు. 2028 ఎన్నికల్లో మునుగోడు నుంచి తొలి బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.నిజాం కాలం నాటి భూ రికార్డులను పరిశీలించి, చట్టబద్ధంగా పేదలకు చెందాల్సిన భూములను గుర్తించి భూమిలేని నిరుపేదలకు న్యాయం చేస్తామని ప్రకటించారు. వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి పాలకూరి అశోక్‌ను కత్తెర గుర్తుపై గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమిరిశెట్టి నరసింహులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల హనుమాన్లు, బంధారపు నరసయ్య గౌడ్, పిట్టల శంకర్, కొమ్మల ప్రవీణ్‌రాజ్, పూజిత, సునీత, లింగం యాదవ్, సతీష్‌బాబు, యాదగిరి, లలిత, సుశీలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన మంచినీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయం



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 6: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ దేహమని పురపాలక సంఘ చైర్పర్సన్ గుగులోత్ జ్యోతి అన్నారు. శుక్రవారం పురపాలక సంఘ పరిధిలోని 31వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ప్రత్యేక చొరవ తీసుకుంటూ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పట్టణంలోని అన్ని వార్డుల్లో మిషన్ భగీరథ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. పట్టణంలోని ఏ ఒక్క వార్డు కూడా అభివృద్ధికి దూరం కాకుండా అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.పైప్‌లైన్ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.స్థానిక వార్డు కౌన్సిలర్ పుచ్చకాయల సరిత కృష్ణ, వార్డు కౌన్సిలర్ బొల్లు రాజు, డి ఈ ఉపేందర్, ఏఈ కుమార్, మున్సిపల్ సిబ్బంది మిషన్ భగీరథ సిబ్బంది, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎఫ్ రామన్నపేట కళాశాల నూతన కమిటీ ఎన్నిక



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 6: రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు, మాజీ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ, జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు.అధ్యక్షుడిగా చిప్పలపల్లి నాగరాజు మాదిగ, ఉపాధ్యక్షుడిగా పోకల శివ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ప్రమోద్ మాదిగ, కార్యవర్గ సభ్యుడిగా సాయి రవిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాదిగ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం జరిగే పోరాటాల్లో విద్యార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు యాకర్ నర్సింగరావు, సోమవరపు శంకర్ మాదిగ, శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు నాబార్డ్ ఆర్థిక సహకారం





తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 6: నాబార్డ్ ఆర్థిక సహకారంతో షార్ప్ సంస్థ ఆధ్వర్యంలో వెల్లంకిలో 'సిరిపురం ఇక్కత్ చేనేత కార్మికుల సమూహం' కార్యక్రమం నిర్వహించారు. నాబార్డ్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయభాస్కర్ పాల్గొని 20 మంది లబ్ధిదారులకు 20 స్టాండ్ మగ్గాలు, 3 వార్ప్ మిషన్లు, 3 ఆసు మిషన్లను ప్రారంభించారు.వెల్లంకి నుంచి 8 మంది, సిరిపురం నుంచి 8 మంది, బోగారం నుంచి 4 మంది లబ్ధిదారులకు పరికరాలు అందించారు. బ్యాంకు అనుసంధానం ద్వారా మరో 9 మందికి రూ.12 లక్షల రుణం మంజూరు చేయించారు. చేనేత కార్మికులంతా కలిసి సహకార సంఘంగా ఏర్పడితే మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఉదయభాస్కర్ సూచించారు. కార్యక్రమంలో నాబార్డ్, బ్యాంకు, షార్ప్ సంస్థ ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దూడిమెట్ల బాలరాజ్ యాదవ్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

- కన్నెబోయిన జ్యోతి బలరాం మాజీ ఎంపీపీ రామన్నపేట



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 6: బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూడిమెట్ల బాలరాజ్ యాదవ్ అక్రమ అరెస్టును మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం తీవ్రంగా ఖండించారు. ప్రశ్నించినందుకే కేసులు పెట్టి అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇది రాజకీయ కక్ష సాధింపేనని అన్నారు. బాలరాజ్ యాదవ్ కు మద్దతుగా నిలుస్తామని తెలిపారు.



స్మశానవాటిక కాదు.. చెత్త డంపింగ్ కేంద్రం!

తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 6: రామన్నపేటదుబ్బాక రోడ్డులోని స్మశానవాటిక సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోతోంది. కాలం చెల్లిన పాల, పెరుగు ప్యాకెట్లతో పాటు పాత ఇనుప సామగ్రి, మాంసం వ్యర్థాలను అక్కడ పడేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ సమస్యపై మండల గ్రీవెన్స్‌లో రెండుసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.అధికారులు స్పందించి వ్యర్థాలు పడేసే వారితో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలని, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలరాజు యాదవ్ అక్రమ అరెస్ట్‌ను ఖండించిన జెట్టి శివ ప్రసాద్ యాదవ్



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 6: బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూడిమెట్ల బాలరాజు యాదవ్ అక్రమ అరెస్ట్‌ను బిఆర్ఎస్వి నకిరేకల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు జెట్టి శివ ప్రసాద్ యాదవ్ తీవ్రంగా ఖండించారు.కేటీఆర్, హరీశ్ రావులపై వ్యాఖ్యలు చేసిన బల్మూరి వెంకట్ ను ప్రశ్నించినందుకే ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి అరెస్ట్ చేయడం రాజకీయ కక్ష సాధింపేనని అన్నారు. బాలరాజు యాదవ్ కు మద్దతుగా నిలుస్తామని తెలిపారు.

గ్రామ అభివృద్ధిపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కలిసిన సర్పంచ్



తొలి అక్షరం/నెక్కొండ నవంబర్ 6: వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని తోపనపల్లి గ్రామ సర్పంచ్ చాగంటి మమత తిరుమల్ మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ వంగాల నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు చాగంటి నారాయణ, కుల్ల వెంకటయ్య, అంబటి వీరారెడ్డి, వర్రే మల్లేష్, నీలకంఠం యాకయ్య, మట్టే బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డిసెంబర్‌లోగా సిలబస్ పూర్తి చేయాలి: కలెక్టర్ స్నేహ శబరిష్





తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో/నవంబర్ 6: విద్యార్థుల విద్య పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, ఎఫ్ఎల్ఎన్ ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వందశాతం నమోదు కావాలని, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం డిసెంబర్‌లోగా సిలబస్ పూర్తి చేసి పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మలగూడెంలో దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ

తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 6: రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామంలో పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్, పశువైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్న ఆధ్వర్యంలో 45 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రైతులు పశువులకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించి, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేందర్, ఉమ, సాగర్‌రెడ్డి, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.



పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకం అమలు చేయాలి

- ఏడాదికి 200 రోజుల పని.. రోజుకు రూ.800 కూలి చెల్లించాలి





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 06: షాద్‌నగర్ పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసి పేదలకు ఉపాధి కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో షాద్‌నగర్ ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 200 రోజుల పని కల్పించి రోజువారీ కూలిని రూ.800కు పెంచాలని కోరారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, మేట్లకు కనీస వేతనాలు నిర్ణయించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి పని ప్రదేశాల్లో తాగునీరు, మెడికల్ కిట్లు, పనిముట్లు అందించాలని కోరారు. కూలీల హక్కుల కోసం సంఘం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

పోతుల యాదగిరి దశదిన కార్యక్రమంలో నివాళులర్పించిన దైద రవీందర్



తొలి అక్షరం / నకిరేకల్, నవంబర్ 6: నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని ఆఫీసర్ కాలనీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతుల యాదగిరి దశదిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పాల్గొని, యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ కోసం యాదగిరి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోతుల రాములు, రవీందర్, గుణగంటి వెంకన్న, సీహెచ్ రాజశేఖర్, నిరంజన్, దేవయ్య, శ్రీను, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కొందుర్గు సహకార సంఘం

- రూ.50 లక్షల రుణాల పంపిణీ.. అర్హులందరికీ త్వరలో రుణాలు



తొలి అక్షరం/కొందుర్గు, నవంబర్ 06: రైతులకు సకాలంలో రుణాలు అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని కొందుర్గు చౌదరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ తుమ్మలపల్లి అనిత జితేందర్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో ఆమె అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ.50 లక్షల రుణాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన రైతులందరికీ త్వరలో రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే రుణాలు పొందిన రైతులు సకాలంలో వాయిదాలు చెల్లిస్తే ఇతర రైతులకు కూడా రుణాలు అందించేందుకు వీలుంటుందన్నారు. అనంతరం పాలకవర్గ సభ్యులు, సిబ్బందికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోబ్రా నాయక్, సీఈఓ నవీన్ కుమార్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూదాన్, గైరాన్, సీలింగ్ భూములపై

సమగ్ర విచారణ చేపట్టాలి

- విట్యాలలో అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ జరపాలి: బక్కని నరసింహులు



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 06: రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూదాన్, గైరాన్, సీలింగ్ భూములను గుర్తించి, వాటి పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు కోరారు. ఈ మేరకు షాద్‌నగర్ ఆర్డీఓ, ఫరూఖ్‌నగర్ తహసీల్దార్‌కు లేఖ రాశారు. ఫరూఖ్‌నగర్ మండలం సోలిపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 154లో ఉన్న 9 ఎకరాల 33 గుంటల భూమిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. గతంలో మహమ్మద్ ఇబ్రహీంకు కేటాయించినట్లు రికార్డుల్లో ఉండగా, ప్రస్తుతం భూదాన్ భూమిగా నమోదైనట్లు పేర్కొన్నారు. అలాగే విట్యాల గ్రామంలోని సర్వే నంబర్ 212లో మైనింగ్ అనుమతులు, తవ్వకాలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి అక్రమ ఆక్రమణలను అరికట్టాలని కోరారు.

బాలల భద్రతకు గ్రామస్థాయి కమిటీ ఏర్పాటు

● బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలి ● 15 మందితో బాలల పరిరక్షణ కమిటీ ఎన్నిక



తొలి అక్షరం/నర్సింహులపేట, నవంబర్ 6: గిరిజన తండాల్లో బాలల భద్రత, సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని గోపతండ సర్పంచ్ రాజేందర్ సూచించారు. మండలంలోని గోపతండ గ్రామపంచాయతీలో మరిపెడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి పెద్దనాగారం సెక్టార్ ఆధ్వర్యంలో గురువారం 15 మంది సభ్యులతో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. సర్పంచ్ రాజేందర్ అధ్యక్షతన అంగన్వాడీ టీచర్ సంధ్యారాణి ఈ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన తండాల్లో బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, పాఠశాలలకు దూరమవుతున్న చిన్నారుల సమస్యలను గుర్తించి అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలల హక్కులు, రక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. బాలబాలికలకు ఎలాంటి వేధింపులు ఎదురుకాకుండా కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలని కోరారు. బాల్యవివాహాల నిషేధ చట్టం, బాలల సంరక్షణ చట్టం, చట్టబద్ధ దత్తత ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సంధ్యారాణి, ఉపేంద్ర, ఉపాధ్యాయురాలు చంద్రకళ, స్వప్న, గ్రామ కార్యదర్శి అనురాధ, ఆశా కార్యకర్త నిర్మల, మాజీ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రమేష్, ఉప సర్పంచ్ ప్రమీల, వీఓ సభ్యురాలు సుగుణ, వార్డు సభ్యుడు రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మల్లికాంబ మనోవికాస కేంద్రం చిన్నారులను అభినందించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి: హన్మకొండ మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన చిన్నారులు తమ స్వహస్తాలతో ఎంతో అందంగా తయారుచేసిన మట్టి దీపాలను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజుకు సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. చిన్నారులు ఎంతో ఆసక్తి,సృజనాత్మకతతో తమ చేతులతో మట్టి దీపాలను తయారు చేయడం పట్ల ఎమ్మెల్యే నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. వారి ప్రతిభను,కృషిని ప్రత్యేకంగా అభినందిస్తూ చిన్నారులను ప్రోత్సహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి,వారికి తగిన ప్రోత్సాహం అందిస్తే వారు మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు స్వయంగా తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా మట్టి దీపాలను తయారుచేసిన చిన్నారులకు,వారికి శిక్షణనిస్తూ ప్రోత్సహిస్తున్న మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు రామలీల కు ఎమ్మెల్యే నాగరాజు అభినందనలు తెలియజేశారు.

యాసంగి సీజన్లో పంటల మార్పిడి చేయండి: ప్రొఫెసర్ జలపతిరావు

- వ్యవసాయ నిపుణులు షేక్ హుస్సేన్,నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ బుగ్గే శేఖర్,సంఘ ఉపాధ్యక్షులు హంసల్ రెడ్డి,ఆర్ దామోదర్ రెడ్డి,ముగిడే పీరయ్య,మోహన్ రావు,చిర్ల రవీందర్,బి.రవీందర్, సుధామల్ల భాస్కర్,ఎన్ విజయ్ లతోపాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు.





తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఎల్ ని నో వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రకృతిలో అనేక మార్పులు జరిగాయని ఈ ప్రభావం వ్యవసాయ రంగంపై కూడా ఉందని వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జలపతిరావు అన్నారు. నగరంలోని అబ్బని కుంట లో ఉన్న తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో ఆ సంఘం నాయకులు రాష్ట్రస్థాయి వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రొఫెసర్ జలపతిరావు మాట్లాడుతూ...వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి చేయాలని జనుము,మినుములు,తెల్ల నువ్వులు తదితర పంటలు పండించుకోవాలని తక్కువ కాలంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఉంటాయన్నారు. రోజురోజుకు భూగర్భ జలాలు తగ్గుతాయని వరి మొక్కజొన్న పంటలు వేయడం వల్ల ఆఖరి దశలో నీరు అందక పంటలు ఎండిపోతాయని దీనిని రైతులు గుర్తించాలన్నారు. తక్కువ నీరుతో పండే పంటల ను సాగు చేయాలన్నారు. ఇదే యాసంగి సీజన్లో తమ తమ భూముల భూసార పరీక్షల చేయించుకోవాలన్నారు. తెలంగాణ రైతు సంఘం గౌరవ అధ్యక్షులు తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకట నారాయణ మాట్లాడుతూ...మారిన వాతావరణ పరిస్థితుల్లో సరైన పంటలు పండించేందుకు ప్రభుత్వపరంగా ఉండే పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. రైతులు పండించిన పంట దళారుల పాలు చేయకుండా రైతులే సొసైటీలను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి కావాలన్నారు. నాబార్డ్ ఇలాంటి జాతీయ సంస్థల ఉపయోగించుకోవాలని సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య తెలంగాణ ఉద్యమ నాయకులు సోమ రామ్మూర్తి సేంద్రీయ

జాతీయ స్థాయి పోటీలకు షాద్‌నగర్ క్రీడాకారుడు షేక్ అఫ్రోఫ్ ఎంపిక



అఫ్రోఫ్‌కు ఎమ్మెల్యే, డీసీపీ ఘన సత్కారం

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటేందుకు షేక్ అఫ్రోఫ్ సిద్ధం

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన షేక్ అఫ్రోఫ్‌కు ఘన సత్కారం


తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 06: షాద్‌నగర్ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన షాద్‌నగర్‌కు చెందిన ఈనాడు లక్ష్య అథ్లెటిక్స్ ఫౌండేషన్ క్రీడాకారుడు షేక్ అఫ్రోఫ్‌కు ఘన సత్కారం లభించింది. మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అఫ్రోఫ్ ఎంపిక కావడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అఫ్రోఫ్‌ను ఘనంగా



సత్కరించి అభినందించారు. క్రీడల్లో అతను కనబరిచిన ప్రతిభ, పట్టుదల ప్రశంసనీయమని పేర్కొంటూ జాతీయ స్థాయిలోనూ రాణించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా డీసీపీ సి. శిరీష రాఘవేంద్ర కూడా అఫ్రోఫ్‌ను అభినందించి, పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ప్రోత్సహించారు. కోచ్ పాండుశంకర్ మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డీసీపీ శిరీష రాఘవేంద్రలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రోత్సాహం అఫ్రోఫ్‌తో పాటు మరెంతో మంది యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో అఫ్రోఫ్ పతకం సాధించి షాద్‌నగర్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సామాజిక సేవలు అభినందనీయం

డాక్టర్ సామ రవీందర్‌రెడ్డిని ప్రశంసించిన పోలీస్ కమిషనర్ సజ్జనార్



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్06: విద్యారంగంతో పాటు వివిధ సామాజిక రంగాల్లో విశేష సేవలందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజేంద్రనగర్ ఆర్థికశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి కృషిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ అభినందించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో రవీందర్‌రెడ్డి కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం చేస్తున్న పోరాటం, ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు నిర్వహిస్తున్న డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు, సామాజిక సమస్యలపై రచించిన వ్యాసాలు, ఆర్థిక అంశాలపై చేసిన పరిశోధనలను వివరించారు. తన సేవలకు సంబంధించిన ఏడు అంశాల పత్రాలను కమిషనర్‌కు అందజేశారు. సమాజ చైతన్యం, యువత భవిష్యత్తు, విద్యాభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమని సజ్జనార్ ప్రశంసించారు. సామాజిక బాధ్యతతో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల ఆరోగ్యమే గ్రామ భవిష్యత్తుకు పునాది!

- భీమదేవరపల్లి మండల కేంద్రంలో అల్పాహార పథకం ప్రారంభం



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం అల్పాహార పథకాన్ని సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు,చదువుపై ఏకాగ్రత పెంపొందించడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ,ఉత్సాహంగా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా సర్పంచ్ ఆకాంక్షించారు.విద్యార్థుల ఆరోగ్యమే గ్రామ భవిష్యత్తుకు పునాది అని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి,వేణుగోపాల్,ఉపసర్పంచ్ శనిగరం ఐలయ్య,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మాచర్ల లక్ష్మి,వార్డు సభ్యులు సంధ్య,శ్రీనివాసరెడ్డి,శ్యామ్,వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

15న ఎస్పీబీ జానకమ్మ స్మృతి గీతారాధన....

ఐకాన్ అవార్డుల ప్రదానం



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్6: లియోనా కల్చరల్ అసోసియేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15న దివంగత ఎస్.పి. బాలసుబ్రమణ్యం, జానకమ్మల స్మృతి గీతారాధనతో పాటు లియోనా దివాళి ధమాకా ఐకాన్ అవార్డ్స్ – 2026 వేడుకలను నిర్వహించనున్నట్లు సంయుక్త నిర్వాహకులు వెల్లడించారు. హిమాయత్ నగర్‌లోని శ్రీముఖి కాంప్లెక్స్ ఎస్.ఎమ్.ఈ. గ్రాండ్ మ్యూజికల్ స్టూడియో వేదికగా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రోజంతా ఈ సంబరాలు జరగనున్నాయి. గాయనీ గాయకుల మెగా మ్యూజికల్ ఈవెంట్, సాంస్కృతిక కళా ప్రదర్శనలు అలరించనున్నాయి. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి సాంఘిక కళా సేవా ప్రతిభా పురస్కారాలు–2026తో పాటు గోల్డెన్ నంది, సింహ అవార్డులు, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారాలను అందజేయనున్నారు. ప్రతిభావంతులకు జ్ఞాపిక, మెడల్, ప్రశంసాపత్రం, శాలువాలతో ఘనంగా సత్కరించనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి, విశిష్ఠ అతిథిగా ప్రముఖ సినీ సంగీత దర్శకులు నేరేటి ప్రణయ్ కుమార్, ఆత్మీయ అతిథిగా భాషా సాంస్కృతిక, టూరిజం శాఖల సలహాదారు డాక్టర్ దరువు అంజన్న హాజరుకానున్నారు. వీరితో పాటు సీనియర్ కవి రామకృష్ణ చంద్రమౌళి (శోభన్ బాబు), మా ఈసీ సభ్యులు డాక్టర్ మాణిక్ రావు, విజయచిత్ర ఎడిటర్ గుర్రంపు విజయ్ కుమార్, నటుడు రమాకాంత్, సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.పి. ఆంజనీ కుమారి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొద లక్ష్మి, డాక్టర్ ఎన్. ఇందిర, సంస్థ అధినేత్రి డాక్టర్ చందోలు ప్రసన్న, నటుడు వీరబాబు, తెలంగాణ ఎరుకల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ తదితరులు పాల్గొన నున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం: విద్యావేత్తలు, కళాకా రులు, వైద్యులు, జర్నలిస్టులు, రచయితలు, గాయకులు, సామాజిక కార్యకర్తలు, వ్యాపారవేత్తలు సహా అన్ని రంగాల ప్రముఖులు ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ ఆలూరి విల్సన్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పేరు, ఊరు, అనుభవం, ఫోటో వివరాలతో 9396610 766, 9494861669 వాట్సాప్ నంబర్లకు పంపి వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కొత్త పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి

- హామీలతో కాలయాపన చేయొద్దు: ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 06:కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులకు వెంటనే మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా మూడు విడతల్లో దరఖాస్తులు స్వీకరించి, పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు.రాష్ట్రవ్యాప్తంగా 5,98,193 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 1,48,882 మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. పునఃపరిశీలన పూర్తయినా పింఛన్లు ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 13న జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరాహార దీక్షలు, 27న సెర్ప్ కార్యాలయం ముట్టడి చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చెన్నయ్య, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

● సర్పంచ్ మేగవత్ లక్ష్మి లక్ష్మణ్ నాయక్ ● కుందేలు కుంట తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ● పాల్గొన్న ఉప సర్పంచ్ వార్డు సభ్యులు





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 06: ఫరూక్‌నగర్ మండలం పరిధిలోని కుందేలు కుంట తండా గ్రామపంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ లక్ష్మి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు సర్పంచ్ చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ... గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి పేదవాడికి అందే విధంగా నిరంతరం కృషి చేస్తామని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామపంచాయతీ పాలన సాగుతోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి లక్ష్మణ్ నాయక్ తో పాటు ఉపసర్పంచ్ రాము వార్డు సభ్యులు రవి, పద్మ సురేష్ నాయక్, లక్ష్మి, పెంట్య నాయక్, శోభ రాజు నాయక్, లోకేష్ నాయక్, కవిత రమేష్ నాయక్, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సురేష్ ఇడపాక ప్రత్యేక కృషితో 20 ఏళ్ల సమస్యకు ముగింపు

- పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సురక్షిత ప్రాంతానికి తరలింపు

- సామాజిక బాధ్యతతో శ్రమించిన సురేష్‌ను ప్రశంసించిన విద్యుత్ అధికారులు, పాఠశాల బృందం



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్6: నాచారం పాత గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. సీనియర్ జర్నలిస్టు సురేష్ ఇడపాక చూపిన చొరవ, ప్రత్యేక కృషితో విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించారు.పాఠశాల ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద గత 20 ఏళ్లుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, విద్యుత్ కేబుళ్ల నుంచి నిత్యం శబ్దాలు, మెరుపులు, మంటలు వస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలు చెందేవారు. ఈ ప్రమాదకర పరిస్థితిని గుర్తించిన సురేష్ ఇడపాక, సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా నిరంతరం శ్రమించారు.సామాజిక బాధ్యతతో ఆయన చేసిన కృషిపై స్పందించిన విద్యుత్ శాఖ ఎస్ఈ పి. వెంకన్న తక్షణ చర్యలు తీసుకుని, ట్రాన్స్‌ఫార్మర్‌ను పాఠశాల ఆవరణ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. విద్యార్థుల భద్రత కోసం చొరవ చూపిన సురేష్ ఇడపాక సేవలు అభినందనీ యమని విద్యుత్ సీఈ పి.వి. రమేష్, ఎస్ఈ పి. వెంకన్న ప్రశంసించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు సురేష్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించగా, విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు డీఈ కె. సుబ్బారావు, ఏడీఈ కె. శ్రీనివాస్, ఏఈ బి. నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయు లు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన షేక్ అష్రఫ్‌కు సత్కారం



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 06: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన షాద్‌నగర్‌కు చెందిన ఈనాడు లక్ష్య అథ్లెటిక్స్ ఫౌండేషన్ క్రీడాకారుడు షేక్ అష్రఫ్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సత్కరించారు. మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్న అష్రఫ్ క్రీడా ప్రతిభ, పట్టుదలను ఎమ్మెల్యే అభినందించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. డీసీపీ సి. శిరీష రాఘవేంద్ర సైతం అష్రఫ్‌ను అభినందించి జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రతిభ కనబరచాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కోచ్ పాండుశంకర్ మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే, డీసీపీలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రోత్సాహం మరెంతో మంది క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో అష్రఫ్ పతకం సాధించి షాద్‌నగర్‌కు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం.. విద్యుత్ అధికారులకు ఘన సన్మానం

- నాచారం పాత గ్రామం ప్రాథమిక పాఠశాలలో 20 ఏళ్ల సమస్యకు ముగింపు

- తీవ్ర ముప్పుగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ సురక్షిత ప్రాంతానికి తరలింపు

- జర్నలిస్టు సురేష్ ఇడపాక ప్రత్యేక కృషితో కదిలిన యంత్రాంగం



తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్6: పాఠశాల ప్రధాన ద్వారం వద్ద నిత్యం శబ్దాలు, మంటలతో భయం గొల్పుతున్న ట్రాన్స్‌ఫార్మర్ ఎట్టకేలకు తొలగిపోవడంతో 250 మంది విద్యార్థులకు నిశ్చింత చేకూరింది.నాచారం పాత గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద గత 20 ఏళ్లుగా వేధిస్తున్న ఈ ప్రమాదకర విద్యుత్ సమస్య పరిష్కారానికి సీనియర్ జర్నలిస్టు సురేష్ ఇడపాక ప్రత్యేక కృషి చేశారు. సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన చూపిన చొరవతో యంత్రాంగం స్పందించింది.సురేష్ ఇడపాక ప్రయత్నాలకు స్పందించిన విద్యుత్ శాఖ ఎస్ఈ పి.వెంకన్న తక్షణమే చర్యలు తీసుకుని, ట్రాన్స్‌ఫార్మర్‌ను పాఠశాల ఆవరణ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. విద్యార్థుల భద్రతకు భరోసానిచ్చిన విద్యుత్ సీఈ పి.వి. రమేష్, ఎస్ఈ పి.వెంకన్న, ఇతర అధికారులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారం అయ్యేలా నిరంతరం శ్రమించిన సురేష్ ఇడపాకను పాఠశాల బృందం, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థుల భద్రతకే తాము తొలి ప్రాధాన్యమిస్తామని, విద్యార్థులు చదువు, క్రీడల్లో ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యుత్ అధికారులు ఆకాంక్షించారు. విద్యుత్ అధికారులు డీఈ కె. సుబ్బారావు, ఏడీఈ కె. శ్రీనివాస్, ఏఈ బి. నాగరాజు, హెచ్ఎం చినబాబు దుప్పట్ల, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విడుదలకు సిద్ధం

- ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు.. ట్రైలర్ విడుదల



'రాజు వెడ్స్ రాంబాయి' చిత్ర విజయంతో మంచి గుర్తింపు పొందిన నిర్మాత వేణు ఊడుగుల సమర్పణలో మరో ఆసక్తికరమైన చిత్రం 'చంద్రయాన్' ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా ఈ నెల 13న భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. వినూత్నమైన కథాంశం, ఆసక్తికరమైన సన్నివేశాలతో ట్రైలర్ ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలను పెంచుతోంది.ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియ దర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సింబ స్క్రీన్ స్టోరీస్ పతాకంపై ప్రవీణ్ మొలక నిర్మించగా, శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు.**వినూత్న ప్రయోగంతో ఆసక్తికర కథనం**గూగుల్ సహాయంతో రాకెట్ తయారు చేసి చంద్రుడిపైకి వెళ్లాలని నలుగురు యువకులు ప్రయత్నాలు ప్రారంభిస్తారు. అందుకోసం తమకు అందుబాటులో ఉన్న వస్తువులతోనే రాకెట్ తయారీకి సిద్ధమవుతారు. రాకెట్‌కు ఇంధనంగా తవుడును ఉపయోగించడం, చంద్రుడిపై వాతావరణంలో జీవించగలదో లేదో తెలుసుకునేందుకు కోడిని అద్దెకు తీసుకురావడం వంటి సన్నివేశాలు వినోదాన్ని పంచుతున్నాయి. సైన్స్‌కు సైతం కొత్త మలుపులు ఇచ్చేలా ఈ యువకుల ప్రయోగాలు సాగుతాయి.అయితే వారి ప్రయత్నాలను గ్రామస్థులు మరో కోణంలో చూస్తారు. రాకెట్ ప్రయోగం గ్రామానికి కీడు చేస్తుందని భావించి వ్యతిరేకిస్తారు. ఎవరూ తమ ప్రయోగాలను నమ్మకపోవడం, ప్రోత్సహించకపోవడం వంటి పరిస్థితుల మధ్య ఆ నలుగురు యువకులు తమ ప్రయత్నాలను కొనసాగిస్తారు. ఈ క్రమంలో గ్రామంలో హత్య ఘటన వెలుగులోకి రావడం, బాబా భాస్కర్ పాత్ర పరిచయం కావడం కథలో ఉత్కంఠను పెంచుతున్నాయి.ఎలాంటి ప్రోత్సాహం లేకపోయినా తమకు దొరికిన వస్తువులతో రాకెట్‌ను ఎలా తయారు చేశారు? వారి ప్రయోగం ఎంతవరకు విజయవంతమైంది? నిజంగానే చంద్రుడిపైకి ప్రయాణించారా? అనే ప్రశ్నలను రేకెత్తిస్తూ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. వినోదంతో పాటు ఉత్కంఠను కలిగించే అంశాలు సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.ఈ చిత్రానికి పుల్లారావు దాసరి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించగా, శ్రీధర్ మేస్త్రి, మందర్ పన్సేకర్ నిర్మాణ రూపకల్పన చేశారు. శ్రీనివాస బి. ఛాయాగ్రహణం, హర్ష ప్రవీణ్ సంగీతం అందించారు. ఈ నెల 13న విడుదల కానున్న 'చంద్రయాన్' ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

'మహాకాళి' శక్తికి ప్రతీకగా..
'అయిగిరి నందిని'

- భక్తి భావాలతో తొలి పాట విడుదల



ఆర్‌కేడీ స్టూడియోస్ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రం నుంచి తొలి పాట 'అయిగిరి నందిని'ని చిత్రబృందం విడుదల చేసింది. ఆదిశంకరాచార్యులు రచించిన ప్రసిద్ధ స్తోత్రానికి శక్తిమంతమైన సంగీత రూపం అందించారు. మహాకాళి అమ్మవారి ఉగ్రశక్తి, దివ్య తేజస్సును ప్రతిబింబించేలా ఈ పాటను రూపొందించారు.స్మరణ్ సాయి స్వరపరిచి, సంగీత రూపకల్పన చేయగా.. అనిలా రాజీవ్, గీతా మాధురి, సాయి చరణ్ గాత్రాన్ని అందించారు. ఇప్పటికే విడుదలైన అక్షయ్ ఖన్నా యుద్ధ నినాద టీజర్‌కు మంచి స్పందన లభించింది. ఆయన నటన, తెరపై కనిపించిన తీరు సినిమాపై అంచనాలను పెంచాయి. తాజాగా విడుదలైన పాటతో చిత్రంలోని భక్తి, ఆధ్యాత్మిక కోణాన్ని పరిచయం చేశారు.ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. భారతీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల నేపథ్యంలో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

ప్రతి అమ్మాయి కీర్తి పాత్రతో అనుబంధం పెంచుకుంటుంది

- 'ఇట్లు అర్జున' కథానాయిక అనస్వర రాజన్



హీరో నాగార్జున సమర్పణలో, వెంకీ కుడుముల నిర్మాణంలో తెరకెక్కిన 'ఇట్లు అర్జున' చిత్రంలో కీర్తి పాత్ర ప్రతి అమ్మాయికి దగ్గరగా ఉంటుందని కథానాయిక అనస్వర రాజన్ తెలిపారు. ఈ చిత్రం నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమె సినిమా విశేషాలను పంచుకున్నారు.తెలుగులో తాను తొలిసారిగా అంగీకరించిన సినిమా 'ఇట్లు అర్జున' అని, ఇందులో కీర్తి పాత్ర ఎంతో అమాయకంగా, ఉత్సాహంగా ఉంటుందని చెప్పారు. ఇప్పటివరకు చేసిన పాత్రలతో పోలిస్తే ఇది చాలా భిన్నమైన అనుభూతినిచ్చిందన్నారు. హీరో అర్జున్‌కు మాటలు రాకపోవడం, అతడు తన ప్రేమను ఎలా వ్యక్తం చేస్తాడన్నదే కథలో ఆసక్తికరమైన అంశమని పేర్కొన్నారు.దర్శకుడు మహేష్ ఉప్పల కథను తెరకెక్కించిన విధానం తనకు నచ్చిందని, హీరోగా పరిచయమవుతున్న అనీష్ మూగవాడి పాత్రకు పూర్తి న్యాయం చేశారని ప్రశంసించారు. ఈ సినిమా కోసం ఇద్దరం ప్రత్యేకంగా సాధన చేశామని తెలిపారు. సంగీత దర్శకుడు తమన్ అందించిన మూడు పాటలకు మంచి స్పందన వచ్చిందని, నాగార్జున ఈ చిత్రాన్ని సమర్పించడం తమకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అనస్వర రాజన్ పేర్కొన్నారు.

'మదరాసి రబ్బరు బొమ్మ'తో 'టైసన్ నాయుడు' పాటల సందడి ప్రారంభం

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నేహా శెట్టి జంటగా ఫోక్ పాట విడుదల

భీమ్స్ సిసిరోలియో సంగీతానికి ఆకట్టుకుంటున్న ప్రేక్షకులు


బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా, సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు' సినిమా నుంచి తొలి పాట 'మదరాసి రబ్బరు బొమ్మ' విడుదలైంది. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి హరీష్ కట్టా కార్యనిర్వాహక నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇందులో సాయి శ్రీనివాస్ మునుపెన్నడూ కనిపించని మాస్ లుక్‌లో శక్తిమంతమైన పోలీసు అధికారిగా నటిస్తున్నారు. నేహా శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది.తాజాగా విడుదలైన 'మదరాసి రబ్బరు బొమ్మ' పాటతో చిత్ర సంగీత ప్రయాణం ప్రారంభమైంది. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ పాట జానపద శైలిలో ఉత్సాహభరితమైన బాణీలు, వేగవంతమైన సంగీతంతో ఆకట్టుకుంటోంది. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ పాటలో వినోదంతో పాటు మాస్ ఆకర్షణను జోడించారు.సురేష్ గంగుల అందించిన సాహిత్యం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హీరో, హీరోయిన్ మధ్య సరదాగా సాగే ప్రేమ సంభాషణలను ఆయన పదాలతో అందంగా ఆవిష్కరించారు. నల్గొండ గద్దర్ నర్సన్న, రోహిణి సొరట్ తమ గంభీరమైన గాత్రంతో పాటకు మరింత ఉత్సాహాన్ని అందించారు.**ఆకట్టుకున్న జంట నృత్యాలు**



పాట చిత్రీకరణలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నేహా శెట్టి రంగుల జానపద దుస్తుల్లో కనిపించారు. సాయి శ్రీనివాస్ తన ఉత్సాహభరితమైన నృత్యాలతో ఆకట్టుకోగా, నేహా శెట్టి కూడా అందమైన నృత్య కదలికలతో అలరించారు. ఇద్దరి మధ్య తెరపై కనిపించిన జోడీ, నృత్యాల సమన్వయం పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విజయ్ పోలాకి నృత్య రూపకల్పన చేశారు. ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం త్వరలో ప్రకటించనుంది.

మరో పవర్‌ఫుల్ పాత్రలో కమల్ హాసన్.. 'సండియార్'గా సరికొత్త అవతారం

ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల.. యాక్షన్ డ్రామాపై పెరుగుతున్న అంచనాలు



విలక్షణ నటుడు కమల్ హాసన్ మరోసారి పవర్‌ఫుల్ పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. దర్శకుడు ఎస్.యు. అరుణ్ కుమార్ తెరకెక్కిస్తున్న పూర్తి స్థాయి యాక్షన్ డ్రామాలో ఆయన నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి 'సండియార్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో కమల్ హాసన్ గతంలో ఎన్నడూ కనిపించని రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో దర్శనమిచ్చారు.**రక్తపు మరకలతో ఆసక్తికర ఫస్ట్‌లుక్** ఫస్ట్‌లుక్‌లో కమల్ హాసన్ ఉప్పు మిరియాల రంగు జుట్టు, బూడిద రంగు గడ్డంతో సరికొత్తగా కనిపిస్తున్నారు. ముదురు గోధుమ రంగు చొక్కా ధరించి వాహనం కిటికీకి ఆనుకుని గంభీరమైన చూపులతో కనిపించిన ఆయన రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాహనంపై కనిపిస్తున్న రక్తపు మరకలు పోస్టర్‌కు మరింత ఉత్కంఠను జోడిస్తున్నాయి. హింసాత్మక పరిస్థితుల మధ్య సాగే బలమైన పాత్రలో ఆయన కనిపించబోతున్నారనే ఆసక్తిని ఈ పోస్టర్ కలిగిస్తోంది.'సండియార్' అనే టైటిల్ ధైర్యం, తెగువ, శక్తిమంతమైన వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. కమల్ హాసన్ లుక్, ఆయన ముఖంలోని తీవ్రత, శరీర భాష చూస్తుంటే రాజీ పడని మనస్తత్వం కలిగిన వ్యక్తి పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. ఫస్ట్‌లుక్ విడుదలతోనే ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది.**భారీ సాంకేతిక బృందంతో నిర్మాణం**

'సేతుపతి', 'చిత్తా' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలను తెరకెక్కించిన ఎస్.యు. అరుణ్ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, సునీల్ కె.ఎస్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అన్బరివ్ యాక్షన్ కొరియోగ్రాఫర్లుగా, అమృతా రామ్ వస్త్రాల రూపకర్తగా పనిచేస్తున్నారు. యాక్షన్, ఉత్కంఠభరిత కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం కమల్ హాసన్ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.